తినుబండారం

- సర్వం కల్తీమయం
- దుకాణాల్లో నాణ్యత లేని చిరుతిళ్లు
- ప్యాకెట్ తినుబండరాలతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారుల పాలిట శాపం
- కనీస తనిఖీలు చేయని అధికారులు


దుకాణంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన కొన్ని చిరుతిళ్ల ప్యాకెట్లు

కాకినాడ సిటీ: సర్వం కల్తీమయం అవుతున్నాయి. ప్రతి వస్తువునూ కల్తీ చేస్తున్నారు కొందరు అక్రమార్కులు, నిత్యావసర సరుకులే కాదు, నిజమైన కంపెనీలను తలదన్నేలా అదే పేరుపై డూప్లికేట్ వస్తువులు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరుతిళ్లు పూర్తి స్థాయిలో కల్తీ అవుతున్నాయి. చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని, ఆకర్షించే రంగులతో రకరకాల ప్యాకెట్లలో స్నాక్స్ తయారు చేసి, షాపులకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులు వాటి వైపు ఆకర్షితులై అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు.

ఎటు చూసినా..

మండలంలోని ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దుకాణాల్లో ఎక్కడా చూసినా నాణ్యత లేని ఆహార పదార్థాల ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. వ్యాపారుల జిమ్మిక్కులతో, పిల్లలను ఆకట్టుకునే కార్టూన్ రంగుల ప్యాకింగుల్లో చిరుతిళ్లు ఆకట్టుకుంటున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారాం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటివల్ల భవిష్యత్తులో ఆరోగ్యానికి పెను ముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా..

ధనార్జనే ధ్యేయంగా సకిలీ చిరుతిళ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంత చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలి, మార్కెట్లోకి వస్తున్నాయి. చూడగానే తినాలనిపించే రకంగా వాటిని తయారు చేస్తున్నారు. విచ్చలవిడిగా దుకాణాల్లో వీటిని అమ్ముతున్నారు. వీటికి సంబంధించి మండలంలో ప్రతి రోజూ భారీఎత్తున వ్యాపారం జరుగుతోంది. అయితే సంబంధిత అధికారులు వీటిపై తనిఖీలు చేయనందునే నాణ్యత లేని, తిను బండరాలు మార్కెట్‌లోకి వస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాసిరకంతో అనారోగ్యం



నాసిరకం తినుబండరాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎక్కువ కాలం నిల్వ ఉండాలనే ఉద్దేశంతో తినుబండరాల్లో వివిధ హానికర కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాలాలు, ఆకర్షణీయమైన రంగుల కోసం ప్రమాదకర పొడర్లు కూడా వినియోగిస్తున్నారు. వీటిని తింటే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ఆర్. శ్రీనివాసనాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, కాకినాడ

అవగాహన కల్పించాలి



పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిండ్లు, ఇళ్లల్లో, పాఠశాలల్లో నివారించాలి. సహజ సిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి. రెడీమెడ్ వాటికి జోలికి వెళ్లకుండా పిల్లల్ని ఉంచడం ఉత్తమం. పిల్లలు మారాం చేసినా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. చిరుతిండ్లకు చిన్నారులను దూరంగా ఉంచేందుకు పాఠశాలల్లో అవగాహన కల్పించాలి.

– కె ప్రవీణ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి, కాకినాడ

పరిస్థితి ఇదీ..

కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో దాదాపు 32 వేలకు పైగా కిరాణా, ఫ్యాన్సీ, కిల్లీ షాపులున్నాయి. వీటిల్లో చిన్నారులు తినే వివిధ రకాల చిరుతిళ్లను అధికంగా అమ్మకాలు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో 23 జెడ్పీ, మున్సిపల్ హైస్కూళ్లు ఉండగా, 66 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటి పరిధిలోనే అధికంగా చిరుతిళ్ల దుకాణాలు వెలిశాయి. దీంతో విద్యార్థులు ఆయా దుకాణాల వద్ద చిరుతిళ్ల ప్యాకెట్లను, వివిధ రకాల తీపి, కారం తినుబండరాలు అధికంగా విక్రయిస్తున్నారు. అదే విధంగా సాయంత్రం వేళల్లో బిర్యానీ, పకోడీ, నూడిల్స్, రంగులేసి వేపిన మాంసం ముక్కలు జోరుగా విక్రయిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఇవి తయారు చేసే దుకాణాలు దాదాపు రెండు వేల వరకున్నాయి. ఇటీవల కాలంలో కాకినాడ సిటీలో వివిధ దుకాణాల్లో అధికారులు దాడులు చేసి కొన్ని హోటళ్లలో పాడైన మాంసం,, రంగులు వేసిన ఆహార పదార్థాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. రామచంద్రపురం, కాపులపాలెం, తాళ్లరేవు, పిఠాపురం, సామర్లకోట, తుని తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల వద్ద నుంచి జంతు కొవ్వులతో చేసిన నూనెలు కొని, వాటితో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కల్తీ ఆహారంతో ఇటు పిల్లలు, అటు పెద్దలు, అనారోగ్యాల బారిన పడుతున్నారు.

క్లుప్తంగా

పారిశుధ్యం, పింఛన్లపై సమీక్ష

కరప: ప్రతి నెలా ఇస్తున్న పింఛన్ల పంపిణీని శనివారం చేపట్టేందుకు గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. ఆలస్యమైనా పింఛన్లు పూర్తి స్థాయిలో అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. క్లోరినేషన్ చేశాకే తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు. ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్ఎంసీలో వన మహోత్సవం


మొక్కలు నాటుతున్న వైద్య విద్యార్థులు

కాకినాడ క్రైం: వన మహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. వీసీ, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాల మేరకు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎంసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 200 మంది వైద్య విద్యార్థులు 120 పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.సౌజన్య వ్యవహరించారు.

ఇన్ఫెక్షన్‌పై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో రోగులకు సేవలందిస్తూ ఇన్ఫెక్షన్ బారిన పడొద్దని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి నర్సింగ్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు, శుక్రవారం కాకినాడ జీజీహెచ్‌లోని సెమినార్ హాల్లో ఇన్ఫెక్షన్ నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ సహా మైక్రో బయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పీవీ ప్రసన్నకుమార్, అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కేఎం ఉమా మంజుల, మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ యశోదమ్మ, మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిర్మల గ్రేస్ అవగాహన కల్పించారు. నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం


వలసపాకల గంగరాజు నగర్‌లో జలమయమైన రోడ్డు

కాకినాడ రూరల్: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ముసురు అలుముకుంది. గురువారం రాత్రి చిరుజల్లులతో మొదలుకొని, శుక్రవారం రాత్రి వరకు వర్షం చినుకులు పడుతూనే ఉన్నాయి. వర్షం ప్రభావంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయంగా మారాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వరి చేలకు వర్షం ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఆసుపత్రి వద్ద ఆందోళన

కాకినాడ క్రైం: కాకినాడ అపోలో ఆసుపత్రి వద్ద ఓ వ్యక్తి కుటుంబం ఆందోళనకు దిగింది. సుమారు ఆరు నెలల క్రితం రాజోలుకు చెందిన 26 ఏళ్ల ఓ యువకుడికి ఆసుపత్రిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. పూర్తి అబ్జర్వేషన్ అనంతరం యువకుడు కోలుకున్నాడని నిర్ధారించుకొని డిశ్చార్జి చేశారు. ఆరు నెలల అనంతరం యువకుడి తలలో అంతర్గత రక్తస్రావం అయింది. అయితే ఇది జరగడానికి కిడ్నీ ఇంప్లాంటేషన్‌కు సంబంధం ఉందేమోనని భావించిన యువకుడి కుటుంబీకులు శుక్రవారం రాత్రి కాకినాడకు వచ్చి ఆసుపత్రి అధికారులతో వాదులాటకు దిగారు. దీంతో వైద్యులు అక్కడికి చేరుకున్నారు. వారిని సావధానంగా కూర్చోబెట్టి, యువకుడి ఆరోగ్య పరిస్థితిని వివరించడంతో పాటు, ఎందుకలా జరిగిందో తెలిపారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు, ప్రస్తుత స్థితికి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. వైద్యుల వివరణతో సంతృప్తి చెందిన కుటుంబీకులు శాంతించారు.

డయల్ యువర్ డీఎంకు ఎనిమిది సమస్యలు

కాకినాడ సిటీ: కాకినాడ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో జిల్లాకు సంబంధించి 8 సమస్యలపై ప్రజలు డీఎం ఎంవీ మనోహర్‌కు విన్నవించారు. స్థానిక అద్దరిపేటకు వెళ్లే బస్సులు వాకలపూడి మీదుగా తిప్పాలని, కాకినాడ, రాజమహేంద్రవరం వయా రాజానగరం రూటులో కొత్త బస్సులు వేయాలని, కాకినాడ బస్ స్టేషన్‌లో వాష్ రూమ్స్ పరిశుభ్రంగా ఉంచాలని, అద్దరిపేట బస్సును కల్పనా సెంటర్లో ఉదయం 8 గంటలకు నడిపితే ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందని తదితర సమస్యలను డీఎంకు వివరించారు. ద్రాక్షారామ నుంచి చర్ల వయా భద్రాచలం మీదుగా తిరిగే బస్సును, కాకినాడ నుంచి ఎస్ తిమ్మాపురం బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఎస్పీ ఆఫీసు వద్ద నుంచి కాకినాడ డిపోకు వచ్చే బస్సులు భానుగుడి సెంటర్ మీదుగా బస్టాండ్‌కు వెళ్లాలని, కాకినాడ, అమలాపురం బస్సులు రావులపాలెం, కొత్తపేట మీదుగా కొన్ని సర్వీసులు నడపాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఎం చెప్పారు.

2న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో సెప్టెంబర్ రెండున సంస్థ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ జాబ్ మేళాలో క్యాపిటల్ ట్రస్ట్ లిమిటెడ్‌లో బీఎం, బిక్యూఎం, ఆర్ఓ, ఐఆర్ఈపీ క్రికెట్ క్యాపిటల్‌లో సేల్ ఆఫీసర్, సీనియర్ సేల్స్ ఆఫీసర్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్, రివ్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్ట్, హెల్పర్, ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ (బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ 2023, 2024 పాస్ అవుట్) ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 2వ తేదీ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్సులతో హాజరుకావాలని తెలిపారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


సూర్యారావుపేటలో బాలాత్రిపుర సుందరి ఆలయంలో సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు


జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో..


రమణయ్యపేట శ్రీపీఠంలో పూజల్లో పాల్గొన్న మహిళలు


కరపలోని దుర్గాదేవి అమ్మవారు

మహిళలతో కిక్కిరిసిన ఆలయాలు

బోట్‌క్లబ్: శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఉదయమే మహిళలు తరలిరావడంతో ఆలయాలన్నీ కిక్కిరిశాయి. స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 1,300 మంది మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారు. ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహిళలకు దాతల సహకారంతో చీర, పూజా సామగ్రి అందజేశారు. స్థానిక సూర్యారావు పేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. సుమారు 2 వేల మంది మహిళలు పాల్గొన్నారు. అమ్మవారు బంగారు చీరలో దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చీర, పూజా సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వందలాది మంది మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈఓ ఎస్ సత్యవాణి ఆధ్వర్యంలో పూజా సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక రామారావుపేట, జగన్నాథపురం శివాలయాల్లో, మార్కెట్‌లోని కనకదుర్గ ఆలయంతో పాటు, నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక వ్రతాలు జరిగాయి. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్థానిక దేవాలయం వీధి, సూర్యారావుపేటలోని ఆలయాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా ఆలయాలకు భక్తులకు తరలివచ్చారు. వ్రతాల్లో పాల్గొన్న మహిళల కోసం ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

కరప: మండలంలోని గ్రామగ్రామాన శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. శ్రావణమాసం చివరివారం కావడంతో మహిళలు వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధర్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి, నక్కా సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెనుగుదురులోని సంతోషీమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్దాపురప్పాడు, యండమూరు, అరట్లకట్ట, పెనుగుదురు, పాతర్లగడ్డ, వలసపాకల, వేములవాడ, వేళంగి, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని భక్తులు దుర్గాదేవిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

కాకినాడ రూరల్: శ్రావణ ఆఖరి శుక్రవారం సందర్భంగా మండలంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రమణయ్యపేట శ్రీపీఠంలో మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. గోకుల్ గార్డెన్‌లో ప్రత్యేక పూజలు, కామాక్షి అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ సహా, మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి.

బీచ్ పార్కు తీర్చిదిద్దేందుకు చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

- కలెక్టర్ షణ్మోహన్ ఆదేశం

కాకినాడ సిటీ: వాకలపూడి వద్ద ఉన్న ఎన్టీఆర్ బీచ్ పార్కు సందర్శకులకు అనువుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన కాకినాడ కార్పొరేషన్ కమిషనర్, జేసీ రాహుల్ మీనాతో కలిసి పంచాయతీ, సర్వే, పర్యాటకశాఖ, శిల్పారామం అధికారులతో కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో నిర్వహిస్తున్న కార్యాకలాపాలపై సమీక్షించారు. అక్టోబర్ రెండు నాటికి వాకలపూడి వద్దనున్న బీచ్ పార్కు సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హరిత రిసార్ట్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకు వివిధ శాఖల అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత, పర్యావరణ సహిత, క్లీన్ అండ్ గ్రీన్‌గా నిర్వహించాలని, సందర్శకులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరంగి ఏఅండ్‌ఎం ఆపరేటర్‌ను ఆదేశించారు. శిల్పారామం, బీచ్ ఫ్రంట్ పర్యాటక ప్రదేశాలను, ఎవరికీ కేటాయించని ప్రభుత్వ భూముల వివరాలు సర్వే నంబర్లతో సహా సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. శిల్పారామం వద్ద మంచినీటి వసతి కల్పించడంతో పాటు, సందర్శకుల సంఖ్య పెంచాలన్నారు. సమస్యను సెప్టెంబర్ 20 నాటికి పరిష్కరించాలని సూచించారు. డీపీవో కె భారతి సౌజన్య, సర్వే ఏడీ బి.లక్ష్మీనారాయణ, టూరిజం రీజనల్ డైరెక్టర్ వి స్వామినాయుడు, జిల్లా పర్యాటక శాఖాధికారి పసుపులేటి పోశయ్య, డీఎం పవన్‌కుమార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పర్యటక శాఖ అధికారులు వెంకటాచలం, సత్యనారాయణ, ఏఈ వెంకటేష్, శిల్పారామం ప్రతినిధి మోహన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో మరొకరికి పునర్జన్మ


కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్యాణ్ చక్రవర్తి

బోట్‌క్లబ్: అవయవ దానంతో మరో వ్యక్తికి పునర్జన్మ ఇవ్వచ్చని రోటరీ క్లబ్ ఎలెక్టెడ్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ అధ్యక్షుడు పోలిశెట్టి ఈశ్వరావు ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలను వారి కుటుంబ సభ్యులు దానం చేస్తే, ఆపదలో ఉన్న వ్యక్తులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ప్రస్తుతం అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓ వ్యక్తి ప్రమాదంలో గాయపడితే, ఆ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతుందన్నారు. అటువంటి పరిస్థితుల్లో ఆ వ్యక్తి అవయవాలు దానం చేసేలా వారి కుటుంబాన్ని ఒప్పించేందుకు కృషి చేయాలన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరాక్ట్ ఆర్గాన్ క్లబ్ పెట్టాలనే ఆలోచనలో ఉన్నామన్నారు. పలువురు ఫార్మసీ విద్యార్థులు అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు వీవీ సత్యనారాయణ, సభ్యులు నామన రమేష్, సీతాపతిరావు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కరప: నడకదురులోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ కోఆర్డినేటర్లు ఆర్.భాస్కర్, సుబ్బు తెలిపారు. ఈ శిబిరంలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వారు వైద్య సేవలు అందజేస్తారని చెప్పారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. గుండె, బీపీ, షుగరు, ఎముకలు, కిడ్నీ వంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని వివరించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

వేద పరిరక్షణకు సహకరిస్తా

- కాకినాడ ఎంపీ తంగెళ్ల


ఎంపీని సత్కరిస్తున్న పరిషత్ సభ్యులు

బోట్‌క్లబ్: వేద పరిరక్షణకు సహకరిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ అన్నారు. శ్రీమదాంధ్ర వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేట గాయత్రి భవన్‌లో 70వ వేదశాస్త్ర పండిత సన్మాన సభ నిర్వహించారు. పరిషత్ అధ్యక్షుడు శ్రీరామ భగవతి అధ్యక్షతన ఈ సభ జరిగింది. రాష్ట్రపతి అవార్డు గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ వేదాల పరిరక్షణలో పండితులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వేద పరిరక్షణకు ప్రజలను కూడా భాగస్వాములు చేసినప్పుడు ఆశించిన ఫలితాలు సమాజానికి అందించగలమన్నారు. విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ వేదాల సంరక్షణ ద్వారానే సమాజాన్ని రక్షించగలమన్నారు. వీటి విషయంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల సహకారం ఉంటే ఆరోగ్యకర సమాజాన్ని స్థాపించగలమన్నారు. పరిషత్ కార్యదర్శి చల్లా శ్రీనివాస నిరంజన్ మాట్లాడుతూ వేదాలకు పుట్టినిల్లు గోదావరి జిల్లాలు అన్నారు. అనంతరం ఎంపీతో పాటు, పలువురు వేద పండితులను సత్కరించారు. దత్తాత్రేయ గురుకుల వ్యవస్థాపకుడు గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనాపాఠి, ద్వారకాతిరుమల రత్నాకర ఘనాపాఠి పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో చవితి ఉత్సవాలు

- జేసీ రాహుల్ మీనా


ఉత్సవాలపై సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ ఏడున అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, జిల్లాలో వేడుకలను విజయవంతం చేయాలని జేసీ రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం కలెరేట్‌లోని కోర్టు హాలు సమావేశ మందిరంలో వినాయక చవితి, నిమజ్జనాల నిర్వహణపై ఆయన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరంలోని ఘాట్ల వద్ద ఏర్పాట్లపై శాఖల వారీగా జేసీ సమీక్షించారు. ఉత్సవాలను పర్యావరణానికి హాని కలగకుండా, శాంతియుతంగా జరిగేలా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఉత్సవ కమిటీలు, శాంతి సంఘాల వారితో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రసాయన విగ్రహాలు వాడకుండా,. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేలా అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై విగ్రహాల ఏర్పాటుకు రెవెన్యూ, పోలీస్, స్థానిక సంస్థలు, విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. బాణసంచా నియంత్రించి, అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. నిమజ్జనం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘాట్ల వద్ద ఏర్పాట్లను అధికారులు జేసీకి వివరించారు. ఘాట్ల వద్ద బారికేడ్లు, హైడ్రాలిక్ క్రేన్లు, లైటింగ్, మైక్ సిస్టం తదితర ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. తొలిరోజు నుంచే ఘాట్ల వద్ద నిమజ్జనానికి సిద్ధంగా ఉండాలన్నారు. సామూహిక నిమజ్జనానికి అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశించారు. డీఆర్వో డి తిప్పేనాయక్, ఆర్డీవోలు సీతారామారావు, ఇట్ల కిషోర్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. శుక్రవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా, ఆరుగురికి రెండు రోజుల వంతున జైలు, 13 మందికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.